ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 309 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

### లోక్‌సభ ఎన్నికల ముందు భారీగా
# ఐపీఎస్‌ల బదిలీలు




### ఎక్సైజ్ శాఖలో ఏకంగా 105 మంది..!

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు చోటుచేసుకున్నాయి. పోలీసు, ఎక్సైజ్, పంచాయితీ రాజ్, రెవెన్యూ శాఖల్లో అధికారులను బదిలీ చేశారు. రాష్ట్రంలో మొత్తం 13 మంది ఐపీఎస్‌లకు కొత్త పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబును మల్టీజోన్-2 ఐజీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ బాధ్యతల్లో ఉన్న ..మిగతా 2లో



# అసెంబ్లీలో మాటల యుద్ధం

కేఆర్ఎంబీకి తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులను అప్పగించబోమని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేసింది. అయితే.. ఈ తీర్మానానికి ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఒక కండీషన్ మీద మద్దతు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన తీర్మానంలో గతం ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని పేర్కొనగా.. దాన్ని తొలిగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

### కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించబోమని అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం
### రేవంత్ సర్కార్ తీర్మానానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం లేదంటూ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. అయితే.. రేవంత్ సర్కార్ పెట్టిన ఈ తీర్మానానికి ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా లేదా అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించగా.. మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పజెప్పబోమని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానానికి ఒక్క కండీషన్‌తో ..మిగతా 2లో



### హరీష్ రావు Vs కోమటిరెడ్డి బ్రదర్స్ 2

### అసెంబ్లీకి రాని కేసీఆర్.. నల్గొండకు ఎలా వెళ్తారు?
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2



# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్
### ఉద్యోగ నియామక పరీక్షల వయో పరిమితి పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది తెలంగాణ ప్రభుత్వం.. ఉద్యోగ నియామక పరీక్షల వయో పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.. ఉద్యోగ నియామక పరీక్షల వయోపరిమితి ఇప్పటి వరకు 44 ఏళ్లుగా ఉండగా.. ఇప్పుడు 44 ఏళ్ల నుండి 46 ఏళ్లకు పెంచింది రేవంత్‌రెడ్డి సర్కార్.. రెండేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుందని పేర్కొంది. వివిధ నియామక పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఇది గుడ్‌న్యూస్‌గా చెప్పుకోవాలి.. అయితే, గత ప్రభుత్వం గరిష్ట వయో పరిమితిని 34 ఏళ్ల నుండి 44 ఏళ్లకు పెంచింది.. అందే 10 సంవత్సరాలు పెంచింది.. ఇక, ఈ ప్రభుత్వం రెండు ఏళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.. నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. నిరుద్యోగ యువత నుండి అనేక ప్రాతినిధ్యాలు స్వీకరించబడ్డాయి.. మరిన్ని ఎనేబుల్ చేయడానికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం గరిష్ట వయోపరిమితిని సడలించడం గురించి ఆలోచిస్తోందని ..మిగతా 2లో

### డిప్యూటీ సీఎంల నియామకం..
## రాజ్యాంగ ఉల్లంఘన కాదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 12 (ప్రభాత ఉదయం): రాష్ట్రాల్లో ఉపముఖ్యమంత్రులను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం ..మిగతా 4లో



### బీహార్ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష
## నితీష్ కుమార్ విజయం


పాట్నా, ఫిబ్రవరి, 12 (ప్రభాత ఉదయం): బీహార్ అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో నితీష్ కుమార్ విజయం సాధించారు. నితీష్ కుమార్ కు అనుకూలంగా 129 ఓట్లు వచ్చాయి.మహాకూటమికి రెండు వారాల క్రితం నితీష్ కుమార్ ..మిగతా 4లో



### నియామక ప్రక్రియను
## పారదర్శకంగా మార్చాం
### ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 12 (ప్రభాత ఉదయం): నియామకాల ప్రక్రియను తమ ప్రభుత్వం పారదర్శకంగా మార్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ..మిగతా 4లో





### తెలంగాణలో
# హుక్కా నిషేధం
### బిల్లు పాస్ చేసిన రేవంత్ సర్కార్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన తీసుకున్న నిర్ణయం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టగా.. చర్చ కూడా జరగకుండానే ఆమోదం లభించింది. దీంతో.. ఇక నుంచి తెలంగాణలో హుక్కా సెంటర్లు మూత పడనున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలో.. ఎక్కపడితే అక్కడ హుక్కా సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండగా.. యువతకు వాటికి బానిసలవుతున్నారని భావించి సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. సంచలన నిర్ణయాలకు కేరాఫ్‌గా మారుతున్నారు సీఎం రేవంత్ రెడ్డి. గత ప్రభుత్వం చేసిన అవకతవకల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్న రేవంత్ రెడ్డి.. ఇటు సంక్షేమం, పాలనలోనూ తన మార్క్ చూపిస్తున్నారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా మార్చాలని కంకణం కట్టుకున్న రేవంత్ రెడ్డి.. ఇప్పటికే పోలీస్ శాఖకు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. డ్రగ్స్, గంజాయి ఇలా ఎలాంటి మత్తు పదార్థాలు రాష్ట్రంలో కనపడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డర్స్ జారీ చేశారు. ఇదే క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అందులోనూ ..మిగతా 2లో



### ఖతార్ నుంచి నేవీ మాజీ అధికారులు
# విడుదల 4
ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో ప్రశంసలు

### నేడు సర్కారు
# మేడిగడ్డ టూర్
### సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల పర్యటన

హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వెళ్లనున్న ప్రజాప్రతినిధులు

ఉదయం 10.15కు బయలుదేరి..

మధ్యాహ్నం 3.30 గంటలకు చేరనున్న బృందం 2

ప్రాజెక్టు పరిసరాల్లో ఏర్పాట్లు.. భారీగా బందోబస్తు


కాళేశ్వరం ఆర్కిటెక్ట్ కేసీఆర్ మేడిగడ్డకు రావాలి: మంత్రి ఉత్తమ్

# నేడు నల్లగొండలో కేసీఆర్ సభ

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారి జనంలోకి

కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై సమరభేరి

ఆరు నెలల్లోగా నీటివాటా తేల్చాలని కేంద్ర, రాష్ట్రాలపై ఒత్తిడి


2

# అసెంబ్లీలో మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి...

మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పెట్టిన తీర్మానంలో "గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నాం" అనే పదాన్ని తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తాము పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కేంద్రానికి ప్రాజెక్టులకు అప్పగించేందుకు ఎప్పుడూ అంగీకరించలేదని హరీశ్ రావు గుర్తు చేశారు. కృష్ణా జలాల కోసం బీఆర్ఎస్ ఉద్యమకార్యచరణ ప్రకటించి.. నల్గొండలో సభ పెడతామని చెప్పడంతోనే ప్రభుత్వం ఇంత హడావుడిగా సభలో తీర్మానం ప్రవేశపెట్టిందని చెప్పుకొచ్చారు. నల్గొండ సభకు స్పందనగా ప్రాజెక్టులు అప్పజెప్పబోమని తీర్మానం చేయడం సంతోషకరమైన విషయమన్నారు. అంతకు ముందు.. ప్రాజెక్టుల విషయంలో రేవంత్ సర్కార్ ప్రవేశపెట్టిన శ్వేత పత్రంపై మాట్లాడిన హరీశ్ రావు.. కృష్ణా ప్రాజెక్టుల అంశంపై కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాలు వాస్తవాలు కాదని.. అవి అవాస్తవాలన్నారు. అవాస్తవాల పుస్తకం అని బుక్ పేరు రాయల్సిందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులు అప్పగించే విషయం నాటి ప్రభుత్వం ఒప్పుకున్నదని అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. అసెంబ్లీలో మాటల యుద్ధం మొదలైంది. రేవంత్.. హరీష్ మాటలతో అసెంబ్లీలో రచ్చకు దారితీసింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలకు కృష్ణ నీళ్లే ప్రాణ ప్రదాయిని అన్నారు. కరీంనగర్ ప్రజలు తరిమేసారని అన్నారు. ఆ వ్యక్తిని పాలమూరు ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించారని అన్నారు. అలాంటి మహానుభావుడు సభకు రాకుండా ఫార్మ్ హౌస్‌లో ఉన్నాడని మండిపడ్డారు. వాస్తవాలు చెప్పాల్సిన అవసరం లేదా ఆయనకు? అంటూ సీఎం ప్రశ్నించారు. తీర్మానానికి మద్దతు చెప్పాల్సిన ప్రతిపక్ష నేత, సభకు రాకుండా ఫార్మ్ హౌస్‌లో దాక్కున్నాడని మండిపడ్డారు. కొందరిది దొంగ బుద్ధి మార్చుకోవాలని సూచించారు. దొంగలకు సద్దులు మోయడం మానుకోవాలన్నారు. కేసీఆర్ కుర్చీ మొన్న ఖాళీగా ఉండేదని.. ఇప్పుడు ఆ సీట్లో పద్మారావు కూర్చోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఆ సీటు పద్మన్నకి ఇవ్వడం మంచిదన్నారు. పద్మన్న ఉద్యమ కారుడని తెలిపారు. ఇక మరోవైపు అసెంబ్లీలో హరీష్ రావు మాట్లాడుతూ.. రేవంత్ కూడా తెలంగాణ గురించి మాట్లాడితే.. దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని అన్నారు. రేవంత్ ను కొడంగల్ నుండి తరిమితే.. మల్కాజిగిరి వచ్చావా..? అంటూ సెటైర్ వేశారు. మేము ప్రెసెంటేషన్ ఇవ్వండి అని అడిగినా.. మాకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మీరు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని.. ఇది మంచిది కాదని హరీష్ రావ్ మండిపడ్డారు. నల్గొండలో సభ పెట్టినం కాబట్టి.. వాళ్లు తప్పులను తెలుసుకున్నరని అన్నారు. కేసీఆర్ పై కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు విత్ డ్రా చేసుకోవాలని కోరారు. లేదంటే మేము మాట్లాడమని అన్నారు. ప్రభుత్వం, ప్రాజెక్టులు అప్పగించమని తీర్మానం చేయడం స్వాగతిస్తున్నామన్నారు.

## అసెంబ్లీకి రాని కేసీఆర్..
## నల్గొండకు ఎలా వెళ్తారు?



అసెంబ్లీకి రాని వ్యక్తి.. మంగళవారం నల్గొండలో అసెంబ్లీకి వెళ్తావా అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపాలని కోరితే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు . అసెంబ్లీకి రాని వ్యక్తి రేపు బహిరంగ సభకు వెళ్తారా అంటూ నిలదీశారు. బీఆర్ఎస్ ఈఎన్‌సీ మురళీధరరావు తమకు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. పదవీ విరమణ చేసినా పదేళ్లపాటు బీఆర్ ఎస్ ప్రభుత్వాన్ని కొనసాగించారని విమర్శించారు. కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా హరీశ్ రావు సభను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో చాలా మంది బీఆర్ఎస్ ఏజెంట్లు ఉన్నారని వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఎన్సీ మురళీధరరావు చేత బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆయన ఆరోపించారు. రిటైర్ అయినప్పటికీ ఆయనను పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో రేయింబవళ్లు పనులు జరుగుతుంటే గత ప్రభుత్వం ప్రశ్నించలేదని అడిగారు. శ్రీశైలంలో ఫ్లడ్ లైట్లు పెట్టి మరీ పనులు చేసిందని తెలిపారు. గోదావరి జలాలు, శ్రీశైలంలో మన భూభాగాలున్నాయని వాటి కోసం ఒప్పందాలు చేసుకున్నాం అనడం అర్థరహితం అన్నారు. తెలంగాణ నీళ్ల కోసమే పుట్టిందని, వాటి కోసమే పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. కనీసం ఇప్పుడైనా ఆ నీటిని సమర్ధవంతంగా వాడుకోవడానికి ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగుతుంటే గతంలో జరిగినవి మళ్లీ గుర్తు చేసుకుని రాష్ట్రానికి అన్యాయం చేయకూడదని కోరారు.



# తెలంగాణలో హుక్కా నిషేధం

మొదటి పేజీ తరువాయి...

ప్రత్యేకంగా హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న హుక్కా సెంటర్లను బ్యాన్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అసెంబ్లీలోనూ బిల్లు ప్రవేశ పెట్టగా.. దానికి ఆమోదం కూడా వచ్చింది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో హుక్కా సెంటర్లపై నిషేధానికి సంబంధించి సిగరెట్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ అమెండ్‌మెంట్ బిల్లును సీఎం రేవంత్ రెడ్డి తరపున మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రవేశపెట్టారు. అయితే.. ఈ బిల్లుపై ఎలాంటి చర్చలేకుండానే సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు ఈ బిల్లు పాస్ అయినట్టుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. ఈ బిల్లు పాసవటంతో.. ఇక నుంచి తెలంగాణలో హుక్కా సెంటర్లు మూతపడనున్నాయి. హుక్కా నిషేధం అమల్లోకి రానుంది. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. సిగరెట్ పొగ కంటే హుక్కా మరింత హానికరమంటూ వివరించారు. యువతకు హుక్కా వ్యసనమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హుక్కాలో బొగ్గు ఉపయోగించడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతుందని.. దీన్ని సేవించే వారితో పాటు, చుట్టుపక్కల వారికి కూడా చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని.. హుక్కా సెంటర్లపై నిషేధం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి భావించినట్టు శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల ముందు భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

మొదటి పేజీ తరువాయి...

తరుణ్‌జోషిని రాచకొండ సీపీగా బదిలీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న డీఐజీ శ్రీనివాసులును రామగుండం సీపీగా నియమించారు. ఆ స్థానంలో జోగులాంబ గద్వాల డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌కు రామగుండం సీపీగా పోస్టింగ్ ఇస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేశారు. గత కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్న జోయల్ డేవిస్‌ను జోగులాంబ జోన్ డీఐజీగా నియమించాలని జనవరిలో ఉత్తర్వులు జారీ అయినా.. ఇప్పుడు వాటిని రద్దు చేసి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా నియమించారు. ఆ స్థానంలో ఉన్న నారాయణ నాయక్‌ను స్టేట్ క్రైమ్ రికార్డుల బ్యూరో డీఐజీగా నియమించారు. ప్రస్తుతం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, సీఐడీ ఎస్పీగా ఉన్న అపూర్వారావును ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా బదిలీ చేశారు. ట్రాన్స్ కో ఎస్పీగా ఉన్న ఉదయ్‌కుమార్‌ను సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగానూ, మల్కాజిగిరి ఎస్ఓటీ డీసీపీగా ఉన్న గిరిధర్‌ను ఈస్ట్ జోన్ డీసీపీగానూ, వెయిటింగ్‌లో ఉన్న మురళీధర్‌ను స్టేట్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గానూ, ఆ స్థానంలో ఉన్న నవీన్ కుమార్‌ను డీజీపీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాల్సిందిగా సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు ఇచ్చారు. రాజేంద్రనగర్ డీసీపీగా ఉన్న సధనారష్మి పెరుమాళ్‌ను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియమించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మూడేండ్లకు పైగా ఒకే పోస్టింగులో ఉన్నా.. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లను, తొమ్మిది మంది అసిస్టెంట్ కమిషనర్లతో పాటు 14 మంది ఎక్సైజ్ సూపరింటెంట్లను బదిలీ చేస్తూ ఆ శాఖ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ శాఖలో పనిచేస్తున్న వివిధ స్థాయిల్లోని 85 మంది సిబ్బందిని కూడా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు.

### తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో భారీగా బదిలీలు

హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో బదిలీల పర్వం కొనసాగుతోంది. తెలంగాణ పంచాయతీరాజ్ శాఖలో భారీగా బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో 105 మందిని బదిలీ చేసింది. సీఈవో, డీఆర్డీవో, అడిషనల్ డీఆర్డీవో, డీపీవోలకు ప్రభుత్వం స్థాన చలనం కల్పించింది. మరోవైపు, తెలంగాణ ఆబ్కారీశాఖలో 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు ఉప కమిషనర్లు, 9 మంది సహాయ కమిషనర్లను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పటికే తెలంగాణలో పెద్ద ఎత్తున తహశీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 132 మంది తహశీల్దార్లు, 32 మంది డిప్యూటీ కలెక్టర్ల(ఆర్డీవో)ను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ కార్యదర్శి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకే ప్రభుత్వం ఈ బదిలీలు చేపట్టినట్లు తెలిసింది. మల్టీజోన్-1లో 84, మల్టీజోన్-2లో 48 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత రెవెన్యూ శాఖలో ఇంత భారీ స్థాయిలో బదిలీలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

పేర్కొంది ప్రభుత్వం.. నిరుద్యోగ యువత.. యూనిఫాం సేవలు కాకుండా ఇతర పోస్టులకు ఈ వయోపరిమితి వర్తింపజేయనున్నారు.. ప్రభుత్వం అన్ని విషయాలన్ని నిశితంగా పరిశీలించిన తర్వాత.. రెండేళ్లు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పుకొచ్చారు. గరిష్ట వయో పరిమితి 44 సంవత్సరాల నుండి 46 సంవత్సరాల వరకు యూనిఫాం సేవలకు కాకుండా.. మిగతా పోస్టులకు రెండు సంవత్సరాల కాలం ఈ వర్తింపు ఉంటుందని పేర్కొంది. ఈ నియమం ఏ పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం వర్తించదు.. పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్లు, అటవీ శాఖలు మొదలైన యూనిఫాం సేవలకు వర్దించదు..



# హరీష్ రావు Vs కోమటిరెడ్డి బ్రదర్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): కృష్ణ జలాల విషయంలో సోమవారం తెలంగాణ అసెంబ్లీ వాడీ వేడీగా సాగింది. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఉదాసీనత వల్లే జల దోపిడీ జరిగిందని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వారికి కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో కోమటిరెడ్డి బ్రదర్స్, హరీష్ రావు మధ్య మాటల యుద్ధం సాగింది. నల్గొండలో ఈ నెల 13న బీఆర్ఎస్ సభ పెట్టడంతోనే.. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ పూర్తిగా అసత్యమైన ప్రజెంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలగజేసుకుని ఏపీ సీఎం జగన్ స్టేట్ మెంట్ విన్న తర్వాత కేసీఆర్ తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ కు నల్గొండ ప్రజలు చెప్పుతో కొట్టినట్లు సమాధానం ఇచ్చారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. పదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తిపై అలాంటి వ్యాఖ్యలు సరికావని.. అమేథీలో రాహుల్ ను కూడా ప్రజలు చెప్పుతో కొట్టినట్టేనా అని నిలదీశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చివరకు, స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని ప్రకటించారు. కేసీఆర్, హరీష్ రావు, జగదీశ్ రెడ్డి తమ జిల్లాను మోసం చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పుణ్యం వల్ల వ్యవసాయం సంగతి పక్కన పెడితే తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఆయన నల్గొండ సభకు రావాలని అన్నారు.

### 'హరీష్ రావు పనిచేస్తారు.. ఏం లాభం?'

మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు కౌంటర్ ఇస్తూ కేసీఆర్ పై అలాంటి వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఇతర మంత్రులు సైతం బీఆర్ఎస్ పై విమర్శలు చేస్తుండగానే.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం హరీష్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి సొమ్ముతో ప్రతిపక్షం లేకుండా చేయాలని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని తాము అనుకోవట్లేదని అన్నారు. 'మేము ప్రశ్నించే గొంతుకను లేకుండా చేయాలని అనుకోవట్లేదు. మేం తలుచుకుంటే మీలా చేయగలం. కానీ చేయం. బీఆర్ఎస్ ధ్వంసం చేసిన వ్యవస్థలను దారిలో పెడతాం. హరీష్ రావు కష్టించి పనిచేస్తారు. కానీ ఏం లాభం.?. ఆయన మంత్రి అయినా నిర్ణయాలన్నీ కేసీఆర్ వే. హరీష్.. కేసీఆర్, కేటీఆర్ మాటలు వినడం ఆపి మా మాటలు వినాలి.' అని వ్యాఖ్యానించారు.

### 'బీఆర్ఎస్ ఎందుకు మోకరిల్లింది'

ఈ క్రమంలోనే ఇతర మంత్రులు సైతం బీఆర్ఎస్ పై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నదీ జలాల విషయంలో ఎందుకు మౌనంగా ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. నీటి సమస్యలు పరిష్కరించకుండా కేంద్రానికి ఎందుకు మద్దతు తెలిపారని నిలదీశారు. 'ప్రత్యేక రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఏపీలో కలిపితే ఎందుకు ప్రశ్నించలేదు?. కేంద్రం వద్ద బీఆర్ఎస్ ఎందుకు మోకరిల్లింది. పదేళ్ల పాటు బీఆర్ఎస్ సర్కారు న్యాయమైన తెలంగాణ వాటాను సాధించలేకపోయింది. ఆ పార్టీ నేతలు తాము చేసిన తప్పులు అంగీకరించకుండా బుకాయిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి జరగలేదని హరీష్ రావు చెప్పగలరా.?. ప్రాజెక్టుల్లో రూ.వేల కోట్ల అవినీతి జరిగింది. దీనిపై నేను ఆధారాలు చూపిస్తా. కేసీఆర్, చంద్రబాబుకు రాజకీయంగా సరిపడదు. ఆయన రెండోసారి సీఎం కాకూడదని కేసీఆర్ భావించారు. జగన్ కు రాజకీయ లబ్ధి కలగాలనే కేసీఆర్ సహకరించారు. రాయలసీమ ఎత్తిపోతలకు మద్దతిచ్చారు.' అంటూ జూపల్లి వ్యాఖ్యానించారు.



# నేడు సర్కారు మేడిగడ్డ టూర్

వరంగల్, హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. ఈ మేరకు సర్కారు ఏర్పాట్లు చేసింది. గత ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు లోపభూయిష్టమని.. ఈ విషయాన్ని చూపేందుకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను మేడిగడ్డకు తీసుకెళతామని నాలుగు రోజుల కింద సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం ఉదయం 10.15 గంటలకు సీఎం రేవంత్‌తోపాటు మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లనున్నారు. సీఎం, మంత్రులు వస్తున్న నేపథ్యంలో.. బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధుల పర్యటన సందర్భంగా మేడిగడ్డ వద్ద అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. బ్యారేజీని పరిశీలించేందుకు వీలుగా.. బ్యారేజీ దిగువన, గోదావరి తీరానికి వెళ్లే మార్గాలను సిద్ధం చేస్తున్నారు. వ్యూపాయింట్ ప్రాంగణం వద్ద 3 వేల మంది కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలు, ఇతర అంశాలపై ఇక్కడ సభ నిర్వహించి, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మంగళవారం ఉదయం 10.15 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం మూడున్నర గంటల కల్లా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల వరకు బ్యారేజీని పరిశీలించి, నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం సీఎం రేవంత్, మంత్రులు మీడియాతో మాట్లాడుతారు. రాత్రి 7 గంటలకు మేడిగడ్డ నుంచి తిరుగు ప్రయాణం అవుతారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాత (ఆర్కిటెక్ట్) కేసీఆర్ మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రావాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కృష్ణా ప్రాజెక్టులు, బోర్డుకు అప్పగింత అంశంపై అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని (బీఆర్ఎస్ మద్దతుతో) ఆమోదించిన విషయాన్ని గమనించాలని కోరారు. సోమవారం అసెంబ్లీ వాయిదాపడ్డాక లాబీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశం మొదలవుతుందని.. మేడిగడ్డ పర్యటన నిమిత్తం సభను వాయిదా వేసి, బయలుదేరుతామని వివరించారు.

# శివబాలకృష్ణకు చుక్కెదురు
## బెయిల్ పిటిషన్ కొట్టివేత



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు చుక్కెదురైంది. శివబాలకృష్ణ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టు కొట్టివేసింది. శివబాలకృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ మేరకు శివబాలకృష్ణ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టివేసింది. అక్రమాస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రూ.250 కోట్ల విలువైన అక్రమాస్తులను ఏబీసీ గుర్తించింది. మరోవైపు శివబాలకృష్ణ వెనుక ఉన్న అధికారుల పాత్ర పై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శివబాలకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్టు గుర్తించామని, ఆయన సమీప బంధువులు, స్నేహితులు, సహ ఉద్యోగుల ఇళ్లలో మొత్తంగా 17 ప్రదేశాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారని ఏసీబీ అధికారులు చెప్పారు. శివబాలకృష్ణ ఇంట్లో రూ. 84.60 లక్షల నగదు, 2 కేజీలు బంగారం, 5.5 కేజీల వెండి, 32 లక్షలు విలువ చేసే వాచ్‌లు, 3 విల్లాలు, 7 ఫ్లాట్స్‌తోపాటు కొడ కండ్ల, జనగామ, నాగర్‌కర్నూలు, సిద్ధిపేట, యా దాద్రి, పాలకుర్తి, జఫర్‌గఢ్ ప్రాంతాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించామని సుదీంద్ర చెప్పారు. భూమి ఆయన పేరుతోపాటు కొందరు బినామీల పేరుపై ఉందని, 29 ఓపెన్‌ప్లాట్లు ఉన్నాయని, రంగారెడ్డిజిల్లాలోనే 12, వైజాగ్, విజయవా డ, సంగారెడ్డి ప్రాంతాల్లో కూడా ఖాళీ స్థలాలు రిజిస్టర్ అయ్యాయన్నారు. అన్నింటి విలువ రూ.250 కోట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సోదాలు ఇంకో నాలుగు చోట్ల కొనసాగుతున్నాయని, శివబాలకృష్ణ పై కేసు నమోదు చేసి, గురువారం న్యాయస్థా నం ముందు హాజరుపరుస్తామన్నారు. 'ఇంకా కొన్ని విషయాలు ఆయన చెప్పలేదు.. మా విచారణకు సహకరించలేదు. కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంటుంది.'అని సుదీంద్ర తెలిపారు.

# నేడు నల్లగొండలో కేసీఆర్ సభ



నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారి జనంలోకి అడుగుపెడుతున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని మర్రిగూడ బైపాస్‌రోడ్డులోని 50 ఎకరాల స్థలంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రైతుగర్జన పేర బీఆర్ఎస్ భారీ బహిరంగసభకు ఏర్పాట్లు చేసింది. కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఈ సభ ద్వారా ఎండగట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగింత విషయంలో రాష్ట్ర ప్రభు త్వం సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేసిన నేపథ్యంలో కేసీఆర్ నల్లగొండ సభలో తన ప్రసంగ శైలిని మార్చే అవకాశముంది. 6 నెలల్లోగా నదీ జలాల పంపకం పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నల్లగొండ సభావేదికగా కేసీఆర్ అల్టిమేటం జారీ చేసే అవకాశాలు ఉన్నాయి.

### పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సభకు ప్రాధాన్యం

గత ఏడాది డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్రకే పరిమితమైంది. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే పార్టీ అధినేత కేసీఆర్ తుంటి ఎముక శస్త్ర చికిత్స జరిగి విశ్రాంతి తీసుకున్నారు. పార్టీ నేతలతో నందినగర్ నివాసంలో, ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ అయిన కేసీఆర్, ఇప్పటివరకు బహిరంగంగా జనంలోకి రాలేదు. ఈనెల 1న గజ్వేల్ ఎమ్మెల్యేగా స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్ అదేరోజు తెలంగాణభవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతోనూ భేటీ అయ్యారు. ప్రస్తుతం శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నా, కేసీఆర్ వాటికి దూరంగా ఉన్నారు. కానీ నల్లగొండ సభలో కేసీఆర్ చేసే ప్రసంగంపై ఆసక్తి నెలకొంది. ఈ సభ ద్వారా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని పరోక్షంగా ప్రారంభించినట్లేనని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

### తెలంగాణభవన్ నుంచి నల్లగొండ సభకు

పార్టీ ముఖ్య నేతలు తెలంగాణభవన్ నుంచి బయలుదేరేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు నల్లగొండ సభకు హాజరవుతారు. కేటీఆర్ నేతృత్వంలో నేతలందరూ ప్రత్యేక బస్సుల్లో నల్లగొండకు వెళతారు. కేసీఆర్ మాత్రం హెలికాప్టర్ ద్వారా నల్లగొండకు చేరుకొని, సభ అనంతరం తిరిగి వాయుమార్గాన హైదరాబాద్‌కు చేరుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం మేడిగడ్డ సందర్శనకు ఏర్పాటు చేసిన నేపథ్యంలో నల్లగొండసభకు కీలక నేతలు హాజరు కావడం ద్వారా ప్రభుత్వ వాదనను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

# నాంపల్లి నుమాయిష్‌కు పెరిగిన జన సందోహం





నాంపల్లి నుమాయిష్‌లో సందర్శకుల సందడి



తాము స్వంతంగా రంగు అద్ది తయారు చేసిన చీరను చూపెడుతున్న తాడ్ బంద్‌కు చెందిన సియా ప్రింట్స్ యజమాని మహమ్మద్ ఇషాక్

బుద్వేల్, ఫిబ్రవరి12(ప్రభాత ఉదయం) : మరో రెండు రోజుల్లో నాంపల్లిలో ఏర్పాటుచేసిన నుమాయిష్ ముగుస్తుండడంతో నుమాయిష్ ను తిలకించడానికి, వివిధ వస్తువులను కొనుగోలు చేయడానికి సోమవారం కూడా వేలాదిమంది ప్రజలు తరలివచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. రాజస్థాన్ పాదరక్షలు , ఒడిస్సా చీరలు, కాశ్మీర్ డ్రైఫ్రూట్స్, ముంబాయి దుప్పట్లు, థాయిలాండ్ టాప్స్ ఇలా ఒక్కటేంటి అనేక రకాలైన వస్తువులు నుమాయిష్ లో తక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయి. మహిళలు ధరించే నైటీలు కేవలం 199 రూపాయలకే నుమాయిష్ లో విక్రయిస్తున్నారు . రాజస్థాన్ పాదరక్షలు కూడా అతి తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయి . లెదర్ బ్యాగ్స్, అమెరికన్ వస్తువులు, కలపతో చేసిన అలంకరణ వస్తువులు, ఇంటికి అందాన్నించే ఫ్లవర్స్ తక్కువ ధరలకే నుమాయిష్ లో అందుబాటులో ఉన్నాయి.

**చీరలు, నైటీలు, ఖాదీ షర్ట్స్ తక్కువ ధరలకే...**

పాతబస్తీ తాడ్ బంద్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇషాక్ విక్రయిస్తున్న చీరలు అతి తక్కువ ధరకే అందుబాటులో ఉన్నాయి. సియా ప్రింట్స్ పేరుతో వారు స్వయంగా రంగు అద్ది తయారు చేసే చీరలు బహిరంగ మార్కెట్లో 3000 వరకు పలుకుతుండగా, ఎగ్జిబిషన్ లో మాత్రం వెయ్యి నుంచి 1200 కి విక్రయిస్తున్నారు. ఖాదీ షర్ట్ లు కేవలం 250 రూపాయలకే అందుబాటులో ఉన్నాయి. నైటీలు 199 రూపాయలకు చౌకగా విక్రయిస్తున్నారు. ఇలా అనేక రకాల వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులో ఉండడంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఒడిస్సా కార్టన్ చీరలను కొనుగోలు చేయడానికి మహిళలు ఇష్ట పడుతున్నారు.

**కాశ్మీరీ డ్రై ఫ్రూట్స్ కు బలే డిమాండ్ :**

నుమాయిష్ లో ఏర్పాటు చేసిన కాశ్మీరీ డ్రై ఫ్రూట్స్ కు గిరాకీ ఎక్కువ గా ఉంది. మార్కెట్ లో దొరికే ధర కన్నా తక్కువ ధరకు కాశ్మీరీ డ్రై ఫ్రూట్స్ నుమాయిష్ లో అందుబాటులో ఉన్నాయి.

**ఉత్తమ స్టాళ్లకు బహుమతులు అందచేసిన మంత్రులు :**

నుమాయిష్ లో ఉత్తమ స్టాళ్లుగా ఎంపిక చేసిన వాటికి సోమవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు లతో పాటు ఎక్సబిషన్ సొసైటీ ప్రతినిధులు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తదితరులు బహుమతులు అందచేశారు.

**ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండ చూస్తున్న బేగం బజార్ పోలీసులు :**




కాశ్మీరీ డ్రై ఫ్రూట్స్ సెంటర్‌లో ఇనాయత్

నుమాయిష్ కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులుగా కలగకుండా బేగంబజార్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అడుగున పోలీసులు కాపలా కాస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అన్ని వర్గాలకు మేలు

బుద్వేల్, ఫిబ్రవరి12(ప్రభాత ఉదయం) : కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలన లో నియంతృత్వం, స్వేచ్ఛ సమానత్వం లేని పాలన కొనసాగిందని ఆరోపించారు. మాట్లాడే హక్కును కూడా కాలరాసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పించారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకో బోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

**అన్ని వర్గాలకు కాంగ్రెస్ ద్వారా మేలు : కరణం నారాయణ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, రాజేంద్రనగర్ :**



కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను కలుపుకుపోయే పార్టీ అని, రాజేంద్రనగర్ కు చెందిన ఆ పార్టీ నాయకుడు కరణం నారాయణ ముదిరాజ్ అన్నారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు , ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పాలన చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ కు ఓటు వేయాలన్నారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : కోరని రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, బుద్వేల్ :**



అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలలో రెండు హామీలను నెరవేర్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని బుద్వేల్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరని రాజ్ కుమార్ అన్నారు. త్వరలోనే ఉచిత కరెంటు హామీని కూడా నెరవేర్చడానికి ఉత్తర్వులు జారీ చేశానన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నోటికొచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇలా అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చని బీఆర్ఎస్ కు రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సైతం ప్రజలు గుణపాఠం నేర్పించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాకపోయినా బీఆర్ఎస్ నాయకులు హామీలు ఎప్పుడూ నెరవేరుస్తారని కాంగ్రెస్ ను అడుగుతున్నారని, వారు ఇచ్చిన హామీలను 10 సంవత్సరాల కాలంలో కూడా నెరవేర్చకపోవడం వారికి గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు.

# మాజీ మంత్రి చిన్నారెడ్డిని కలిసిన సీనియర్ జర్నలిస్ట్ వర్కాల చందు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన సీనియర్ జర్నలిస్టు వర్కాల చందు కలిశారు. సోమవారం మాజీ మంత్రి చిన్నారెడ్డి అత్తాపూర్ మాజీ సర్పంచ్ స్వర్గీయ కాంతారెడ్డి కుమారుడు రవీందర్ రెడ్డి తో కలిసి జిహెచ్ఎంసి కార్యాలయానికి వచ్చిన సందర్భంగా చందు తెలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ జి చిన్నారెడ్డి మాట్లాడుతూ... తాను వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే వ్యవసాయ కోర్సు చదువుకున్నానని ఈ ప్రాంతంతో ఎంతో తనకు అనుబంధం ఉందన్నారు. సి ఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు.




# వాచ్‌మెన్ హత్య కేసులో బీహార్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్టు

శంషాబాద్, ఫిబ్రవరి 12, (ప్రభాత ఉదయం) శంషాబాద్ ఆర్ జి ఐ ఏ. పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్ లోని పరిశ్రమ వాచ్ మెన్ దారుణ హత్యకు గురైన సంఘటనలో నిందితులైన ముగ్గురి వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు పంపించారు. శంషాబాద్ ఆర్ జి ఐ ఏ ఇన్స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం...... నేపాల్ రాష్ట్రానికి చెందిన విజయ్ బహదూర్ షార్కి (52) ని కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో ప్రధాన నిందితులైన బీహార్ రాష్ట్రానికి చెందిన చోటు కుమార్ రే . నిత్యానంద్ రే. గోల్ కుమార్ మిశ్రా అనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. చిన్న విషయమై వీరి మధ్యన మాట మాట పెరగడంతో విజయ్ బహదూర్ ను కత్తితో పొడిచి చంపారు.

# బుద్వేల్‌లో ఎన్నికల సందడి

బుద్వేల్, ఫిబ్రవరి12(ప్రభాత ఉదయం) : బుద్వేల్ లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలంటే జిహెచ్ఎంసి ఎన్నికలో... ఎమ్మెల్యే ఎన్నికలో... ఎంపీ ఎన్నికలో... అనుకునేరు... అవేమి కాదు. మరే ఎన్నికలు అనుకుంటున్నారా.... బుద్వేల్ బస్తీ కమిటీ ఎన్నికలు. వివరాలలోకి వెళితే బుద్వేల్ లో అరుంధతి సంక్షేమ సంఘం ఉంది. అరుంధతి సంక్షేమ సంఘం బుద్వేల్ బస్తి కి కేంద్ర బిందువు గా ఉంటుంది. బస్తీలో పండుగలైనా, ఎలాంటి శుభకార్యాలైనా, ఎవరైనా తగువు పడినా, సమస్యలున్న అరుంధతి సంక్షేమ సంఘమే పరిష్కారం చూపుతుంది. దానికి ప్రతి రెండు సంవత్సరాల కు ఒకసారి కమిటీని ఎన్నుకుంటారు. అయితే ఆ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఉండదు. నామినేషన్ క్ లు వేస్తారు... ఎన్నికలలో నిలబడతారు.... ప్రచారం చేసుకుంటారు... పోలింగ్ జరుగుతుంది... ఆ తర్వాత గెలిచిన అభ్యర్థులకు బాధ్యతలను అప్పగిస్తారు.

**నామినేషన్ల స్వీకరణ పూర్తయింది :**

అరుంధతి సంక్షేమ సంఘానికి ఈనెల 11, 12 తేదీల్లో నామినేషన్లు స్వీకరించారు. బస్తి ఎన్నికల నిర్వహణ బాధ్యతలను బుద్వేల్ కు చెందిన ఉపాధ్యాయులు కోరని అర్జున్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కోరని దేవదానం లకు అప్పగించారు. వారి ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వాహణ జరుగనుంది.

# కాలనీ, బస్తీలు పెరుగుతున్నాయి పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలి: వై శ్రీధర్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న కాలనీలు, బస్తీలకు అనుగుణంగా పారిశుధ్యాన్ని సంపూర్ణంగా చేపట్టడానికి పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలని బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ కోరారు. సోమవారం జిహెచ్ఎంసి సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న ను బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి బాబురావు తో కలిసి బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ వినతి పత్రం అందజేశారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల పారిశుధ్యం సక్రమంగా జరగడం లేదని దీంతో రోడ్లపై చెత్తాచెదారం పేరుకు పోతుందని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రం లో పేర్కొన్నారు. గత కొన్ని ఏళ్లుగా రాజేంద్రనగర్ లో రెండు గ్రూపులు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాయని అయితే జనాభా పెరగడం వల్ల పారిశుధ్యం చేయలేకపోతున్నారని వివరించారు. రాజేంద్రనగర్ లో ప్రభుత్వ రంగ సంస్థలు ఉండడం వల్ల ప్రముఖులు రాకపోకలు సాగిస్తున్నారు అని అందుకోసం పారిశుధ్యాన్ని సంపూర్ణంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం హెడ్ క్వార్టర్, మండల కార్యాలయం ఉండటంతో వివిధ శిక్షణ కార్యక్రమాలు, అవసరాల నిమిత్తం అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు ఇక్కడికి వస్తుంటారని అందుకోసం ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్యం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అంతే కాకుండా ఒక గ్రూప్ ని చింతల్ మెట్ కి ట్రాన్స్ఫర్ చేసారు. అప్పటి నుండి ఇంకా కష్టాలు మొదలైనాయి వీధులను వదిలేసి కాళీ మెయిన్ రోడ్ లను మాత్రమే శుభ్రం చేస్తున్నారు వీధులలో చెత్త పేరుకుపోయి దుర్వాసనలు వస్తున్నాయి . సాధ్యమైనంత త్వరగా పారిశుధ్య సిబ్బందిని పెంచి సంపూర్ణ పారిశుధ్యం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు




జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్



మార్కండేయ స్వామికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

# శంషాబాద్‌లో ఘనంగా మార్కండేయ స్వామి జయంతి వేడుకలు

శంషాబాద్, ఫిబ్రవరి 12, (ప్రభాత ఉదయం) శంషాబాద్ పద్మశాలి సేవ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి కులదైవం శ్రీ మార్కండేయ స్వామి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిపాటి పాండు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరమశివుడి ప్రీతిపాత్రుడైన మార్కండేయ స్వామి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈశ్వరుడి అనుగ్రహంతో మార్కండేయ స్వామి ఆశీస్సులతో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని మార్కండేయ స్వామి స్ఫూర్తిగా తీసుకొని పద్మశాలీలు మరింత చురుకుగా వ్యవహరించాలని పులిపాటి పాండు సూచించారు. సంఘం నాయకులు కాశి గారి ఆంజనేయులు. వర్కల శ్రీరాములు, బొడ్డు మనోహర్, పుట్ట వీరేశం, పాప నీ వెంకటేష్, మారేపల్లి సత్యం, నాగేష్, పుంజాల మహేష్ కుమార్, పులిపాటి బాలరాజు, నారని వెంకటేష్, పులిపాటి రవి, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

# ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

## డిప్యూటీ కమిషనర్ రవికుమార్

**ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ..**

రాజేంద్రనగర్,ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) ప్రజల నుంచి స్వీకరించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వివిధ విభాగాల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటారని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ..సమస్యల పరిష్కారం కోసం అధికారులు శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సానుకూలంగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4 ఫిర్యాదులు,వినతులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఈఈ నరేందర్,టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణ మోహన్, డిపిఓ సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి రాధారాణి, యూబీడి మేనేజర్ ప్రసన్న కుమార్,డిఏఓ పద్మావతి,ఏఎంసి జయప్రకాష్,శ్రీనివాసులు పాల్గొన్నారు.




నార్సింగి నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్ హరికృష్ణ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# నార్సింగి నూతన ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకుడు మల్యాద్రి నాయుడు

గండిపేట, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) నార్సింగి నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్ హరి కృష్ణ రెడ్డి ని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ శ్రీ మాల్యాద్రి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్ బాలిరెడ్డి ఇంద్ర , సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిట్టల సత్యనారాయణ, డాక్టర్ ఎన్ ప్రభావతి ,రమాదేవి లు మర్యాదపూర్వకం కలిశారు.





ప్రసంగిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ స్వరూప్.. హాజరైన విద్యార్థులు

# నైతికతకు పెద్దపీట వేయాలి

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ స్వరూప్

**మార్పును ఆహ్వానించండి.. అదే విజయాన్ని తెచ్చిపెడుతుంది**

శంషాబాద్ , ఫిబ్రవరి 12. (ప్రభాత ఉదయం): ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ లాంటి వివిధ అఖిలభారత సర్వీసులలో ఉండే అధికారులు నైతికతకు బద్ధులై ఉండాలని, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పనిచేసి దేశానికి అత్యున్నత సేవలు అందించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ స్వరూప్ సూచించారు. శంషాబాద్ పట్టణంలోని కృష్ణ ప్రదీప్ ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీలో సోమవారం జరిగిన రెండురోజుల కాలేజి ఫెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దైనందిన ఉద్యోగ జీవితంలో ఉన్నతాధికారులకు అనేక సందిగ్ధతలు ఎదురవుతాయని, అలాంటి సందర్భాల్లో ప్రజలకు ఏది అత్యున్నత ప్రయోజనం కలిగిస్తుందో ఆ నిర్ణయాన్ని మాత్రమే తీసుకోవాలని ఆయన సూచించారు. ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు రాజకీయపరమైన ఒత్తిళ్లు కూడా చాలా ఎదురవుతుంటాయని, వాటిని సమర్థంగా ఎదుర్కోవడంలోనే అధికారుల చాకచక్యం అంతా నిరూపితం అవుతందని అనిల్ స్వరూప్ పేర్కొన్నారు. అకాడమీ వ్యవస్థాపక ఛైర్మన్ కృష్ణ ప్రదీప్ మాట్లాడుతూ, 2003లో స్థాపించిన తమ అకాడమీ ఇప్పుడు క్రమంగా న్యూఢిల్లీ, అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, శంషాబాద్ లాంటి వివిధ శాఖలకు విస్తరించిందని, ఈ 21 ఏళ్ల ప్రస్థానంలో ఇప్పటివరకు సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెంటార్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఖతార్ నుంచి నేవీ మాజీ అధికారులు విడుదల

## ప్రధాని మోడీపై సోషల్ మీడియాలో ప్రశంసలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 12 (ప్రభాత ఉదయం): 18 నెలలుగా ఖతార్ జైలులో మగ్గిన ఇండియన్ నేవీ మాజీ అధికారులు సురక్షితంగా భారత్ కు తిరిగి వచ్చారు . ప్రధాని నరేంద్ర మోడీ దౌత్యపరమైన చొరవ వల్లే ఇది సాధ్యమైంది. దీంతో సోషల్ మీడియాలో ప్రధానిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గూఢచర్యం ఆరోపణలపై నెలల తరబడి జైలు శిక్ష అనుభవించి ఖతార్ కోర్టు ఇటీవల విడుదలైన ఎనిమిది మంది భారత నౌకాదళ సిబ్బందిలో ఏడుగురు సోమవారం ఉదయం న్యూఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. తాము స్వదేశానికి తిరిగి రావడానికి ప్రధాని మోడీ నేతృత్వంలో నిరంతర దౌత్య ప్రయత్నాలే కారణమని అన్నారు. ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఏడుగురు భారత నౌకాదళ మాజీ అధికారులు మీడియాతో మాట్లాడారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో నేరుగా మాట్లాడినందుకు మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. తమను విడిపించడానికి ప్రధాని దౌత్యపరమైన చొరవే కీలకంగా ఉందని కొనియాడారు. "చివరికి సురక్షితంగా, ఆరోగ్యంగా ఇంటికి తిరిగి రావడం నాకు సంతోషంగా ఉంది. మా విడుదలకు ఆయన (ప్రధాని మోడీ) వ్యక్తిగత జోక్యం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. దానికి నేను ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే ఖతార్ స్టేట్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి కృతజ్ఞతలు" అని ఓ నేవీ మాజీ అధికారి అన్నారు. విడుదలలో ప్రధాని మోడీ పోషించిన పాత్రను మరో నేవీ అధికారి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ప్రధాని మోదీ జోక్యం లేకపోతే మేం స్వేచ్ఛగా నడిచేవాళ్లం కాదు. మాకు స్వాతంత్ర్యం రావడానికి అత్యున్నత స్థాయిలో ఆయన అలుపెరగని కృషి, జోక్యం లేకపోతే ఈ రోజు మీ ముందు నిలబడేవాళ్లం కాదు" అని వ్యాఖ్యానించారు. నేవీ మాజీ అధికారులు సురక్షితంగా భారత్ కు తిరిగి రావడం పట్ల సోషల్ మీడియాలో యూజర్లు ప్రధాని నరేంద్ర మోడీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ సలహాదారు కంచన్ గుప్తా ఎక్స్ (ట్విట్టర్) లో ఇలా పోస్ట్ పెట్టారు. "తప్పుడు 'గూఢచర్యం' ఆరోపణలపై ఖతార్ లో నిర్బంధించబడి మరణశిక్షకు గురైన ఎనిమిది మంది భారతీయుల కుటుంబాలను సజీవంగా తిరిగి తీసుకువస్తామని మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎప్పటిలాగే ప్రధాని 'మోడీ గ్యారంటీ' మ్యాజిక్ లా పనిచేసింది. మొత్తం ఎనిమిది మందిని విడుదల చేశారు. ఏడుగురు ఇళ్లకు చేరుకున్నారు." అని పేర్కొన్నారు. మరి కొందరు యూజర్లు కూడా ఈ పరిణామాన్ని భారతదేశ దౌత్యం గొప్ప విజయానికి ఉదాహరణ అంటూ కామెంట్స్ చేశారు.



జూరాల ప్రాజెక్టు పై మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# కృష్ణానది జలాలపై మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు

## పదేండ్లు పాలమూరు ప్రాజెక్టులపై వివక్ష చూపారు

## పదేళ్లలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులకు తీరని అన్యాయం చేశారు

కొత్తకోట, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) గత పదేళ్ల ప్రాజెక్టులు తొక్కి పెట్టి కొత్త డ్రామాలు ఎందుకు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం కొత్తకోట మండల కేంద్రంలో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం పరి పాలన చేసి దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకూండా నిర్లక్ష్యం చేసి ప్రతి సంవత్సరం కృష్ణానది నుండి వచ్చే వరదను పదేళ్ల నుండి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వేల టి ఎం సి ల నీటిని సముద్రం పాలు చేసి అన్యాయం చేసిన కేసీఆర్ ఇప్పుడు కృష్ణాజిల్లాలపై మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. నల్గొండలో మంగళవారం జరిగే కెసిఆర్ సభకు నిరసనగా కిసాన్ కాంగ్రెస్ రాష్ట నాయకుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. టిపిసిసి రాష్ట్ర కల్లుగీత సంఘం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు సాగునీటి రంగాల అభ్యున్నతికి తిలోదకాలిచ్చి పది సంవత్సరాల పరిపాలనలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హాయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన జలయజ్ఞం కింద చేపట్టిన ఉమ్మడి జిల్లాకు చెందిన నెట్టెంపాడు, కల్వకుర్తి, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు 90% శాతం పూర్తిచేసిన 10% పనులకు పదేండ్ల అయిన ప్రాజెక్టులకు నయా పైసా ఇవ్వకుండా ఒక ఎకరాకు సాగునీరు ఇవ్వలేదని తీవ్రంగా మండిపడ్డారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల ను పట్టించుకోకుండా నిలువున సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి అసంపూర్తిగా వదిలేశారన్నారు. పాలమూరు ప్రాజెక్టులకు గట్టు ఎత్తిపోతలకు,తుమ్మిళ్లకు అదేవిధంగా పాలమూరు రంగారెడ్డి, దిండి, ఎస్ ఎల్ బి సి ప్రాజెక్టులను పట్టించుకోకుండా నిధులు ఇవ్వకుండ నిర్లక్షం చేసి దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చి 13న నల్గొండలో కృష్ణ బేసిన్ లో ఉండే రైతులకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏ ముఖం పెట్టుకుని సభ నిర్వహిస్తారని బి ఆర్ ఎస్ నాయకులను ప్రశ్నించారు. పదేళ్లలో కృష్ణా పరీవాహక ప్రాంతంలో కొత్తగా ఒక్క ఎకరానికైనా నీళ్లు పారించారా కేసిఆర్ వీటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణ బేసిన్ పై 2015 జూన్ 19 తేదీన కృష్ణా జలాలపై అగ్రిమెంట్ పై సంతకం చేసి ఇప్పుడు తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మాయమాటలతో చెప్పుతే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు.కృష్ణ నీటి వాటల్లో తెలంగాణకు వచ్చే నీటిపై ఆంధ్ర ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు కట్టి జలదోపిడి చేసినా గొంతెత్తకుండా తెలంగాణ ప్రయోజనాలను కాపాడకుండా అక్రమంగా నీటిని తరలిస్తూ అన్యాయం జరుగుతుంటే ఆంధ్ర సీఎంతో చె ట్టాపట్టాలేసుకొని మనకు వచ్చే నీటి హక్కులను మంటలో కలిపి అధికారం పోయిన వెంటనే పక్కదారి పట్టించడానికి ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటు అన్నారు. జలదోపిడి జరిగినా వాస్తవాలు తొక్కిపెట్టి బట్ట కాల్చి కాంగ్రెస్ ప్రభుత్వం పై వెయ్యడానికి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమ చింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాండురంగం యాదవ్, అమరచింత కిసాన్ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, విష్ణు యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, భగవంతు, విష్ణు, మోహన్ రెడ్డి, హనుమంతు నాయక్, భాస్కర్, మహబూబ్, పెద్ద ఎత్తున రైతులు యువకులు పాల్గొన్నారు.

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం) ఇటీవల కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారం జాతీయస్థాయి రాజకీయ సీనియర్ నేత, అత్యున్నతమైన దేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కు ప్రకటించిన విషయం విదితమే. సోమవారం ఆయనను అన్వేయ కన్వెన్షన్, గచ్చిబౌలిలో జరిగిన సత్కార కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొని పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# బీహార్ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నితీష్ కుమార్ విజయం

మొదటి పేజీ తరువాయి...

గుడ్ బై చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరారు. దీంతో సీఎం పదవికి రాజీనామా చేశారు.ఈ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. బీజేపీ మద్దతుతో ఆయన సీఎంగా ప్రమాణం చేశారు. అసెంబ్లీలో విశ్వాస పరీక్షలను ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది. బీహార్ అసెంబ్లీలో విశ్వాస పరీక్ష సమయంలో ముగ్గురు రాష్ట్రీయ జనతాదళ్ ఎమ్మెల్యేలు ప్రహ్లాద్ యాదవ్, నీలందేవి, చేతన్ ఆనంద్ లు ఎన్‌డీఏ కూటమికి మారారు.బీహార్ అసెంబ్లీలో 243 మంది ఎమ్మెల్యేల్లో 129 మంది నితీష్ కుమార్ కు మద్దతు పలికారు. విశ్వాస పరీక్ష సమయంలో ఆర్‌జేడీ నేతృత్వంలోని విపక్ష కూటమి వాకౌట్ చేసింది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 మంది ఎమ్మెల్యేలు.అయితే మ్యాజిక్ ఫిగర్ కు 122 మంది ఎమ్మెల్యేలు అవసరం. బీజేపీకి 78 మంది ఎమ్మెల్యేలున్నారు. జేడీ(యూ)కు 45 మంది ఎమ్మెల్యేలున్నారు. ఆర్‌జేడీకి 79 మంది ఎమ్మెల్యేలున్నారు. కాంగ్రెస్ కు 19 మంది ఎమ్మెల్యేలున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ కు 16 మంది ఎమ్మెల్యేలున్నారు.

# డిప్యూటీ సీఎంల నియామకం.. రాజ్యాంగ ఉల్లంఘన కాదు: సుప్రీం

మొదటి పేజీ తరువాయి...


కొట్టివేసింది. ఈ విధానాన్ని అవలంబించడం రాజ్యాంగ ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. డిప్యూటీ సీఎంల నియామకాన్ని సవాల్ చేస్తూ పబ్లిక్ పొలిటికల్ పార్టీ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడం రాజ్యాంగంలోని నిబంధనను ఉల్లంఘించడమేనని, దీని ద్వారా రాష్ట్రాలు తప్పుడు ఉదాహరణగా నిలుస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై తాజాగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిన్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఇది రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని వెల్లడించింది. "పార్టీ లేదా సంకీర్ణ ప్రభుత్వంలోని సీనియర్ నాయకులకు కాస్త ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడానికి చాలా రాష్ట్రాలు ఉపముఖ్యమంత్రిని నియమించే పద్ధతిని అవలంబిస్తున్నాయి. అయితే, అది కేవలం ఒక పేరు మాత్రమే. డిప్యూటీ సీఎంగా ఎవర్నైనా నియమించినా వారు కేబినెట్ మంత్రి హోదాలోనే ఉంటారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వానికి ఉపముఖ్యమంత్రి మొట్టమొదటి, అత్యంత ముఖ్యమైన మంత్రిగా ఉంటారు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు రాదు" అని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది.

# గృహజ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## కూకట్ పల్లి ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన గ్యారంటీలో భాగంగా సోమవారం ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి బాలానగర్ డివిజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుండి విద్యుత్ అధికారులతో కలిసి కరెంట్ బిల్, సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల నరేందర్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, చెన్నయ్య, రాజు, సత్యం, నాగేష్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



# అలంపూర్ శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి

అలంపూర్, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) ఐదవ శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాలను ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు, ఈవో పురంధర్ కుమార్ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి శేష వస్త్రం బహుకరించారు. అనిల్ రావిపూడి సరిలేరు నీకెవ్వరు, ఎఫ్ 2, భగవంతు కేసరి సినిమాలు నిర్మించారు.

# మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం దర్శించుకున్న గద్వాల ఎమ్మెల్యే సోదరి, తల్లి



మల్దకల్, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం)ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తల్లి రేవతమ్మ, సోదరి విశాలా శేష రెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అర్చకులు రమేష్ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. దేవాలయంలో గోశాల సంరక్షణ నిధి కింద విశాల శేషా రెడ్డి రూ.50,001 విరాళం క్రింద బ్యాంకులో ఫిక్స్ చేసిన బాండ్ ను అర్చకులకు అందజేశారు.



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న అడ్డాకుల జడ్ పి టి సి రాజశేఖర్ రెడ్డి

# ఘనంగా అడ్డాకుల మండల జడ్‌పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

## పేదలకు దుస్తులను పంపించేసిన రాజశేఖర్ రెడ్డి

అడ్డాకుల, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం)అడ్డాకుల మండల జడ్పిటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అడ్డాకుల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మాజీ వార్డు మెంబర్ సభ్యులు మునగల కిన్నెర దానియేలు ఆధ్వర్యంలో జడ్పిటీసీ రాజశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసుల తో కలిసి కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జడ్పిటీసీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ప్రజా క్షేత్రంలో అత్యున్నత స్థాయికి ఎదుగుతూ ప్రజలకు సేవ చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సందర్భంగా నిరుపేద వితంతువులకు చీరల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ సభ్యులు మునుగల కిన్నెర దానియేలు, మునగాల లక్ష్మయ్య, మేస్త్రి దానియేలు,మునుగాల చెన్నయ్య, గండ సాయిలు, మన్యం,దేవదానం,కుర్మన్న, సులమాన్, శివన్న,చంద్రకాంత్,డేవిడ్,సాయన్న, రమేష్, ప్రశాంత్, నాగార్జున, శాంత కుమార్,చంద్రయ్య, కొండన్న, అయ్యన్న ఎస్సీ కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అక్రమంగా సరఫరా చేస్తున్న నల్ల బెల్లం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

# 153 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13(ప్రభాత ఉదయం)తమిళనాడు రాష్ట్రం సేలం నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాలలో అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తున్న క్రమంలో గద్వాల ఎక్సైజ్, డిటిఎఫ్ బృందం దాడులు నిర్వహించారు. 510బస్తాలలో రూ.7లక్షలు విలువ చేసే 153 క్వింటాళ్ల నల్ల బెల్లం స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గద్వాల్ ఎక్సైజ్ సీఐ గోపాల్ కథనం మేరకు సోమవారం ధరూర్ మండలం పరిధిలోని పలు గ్రామాలలో లారీలో నల్లబెల్లం తెచ్చి విక్రయిస్తున్నట్లు గద్వాల్ ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందడంతో కొత్తపాలెం స్టేజ్ వద్ద ఆ లారీని తనిఖీ చేయగా అందులో నల్లబెల్లం గుర్తించారు. తమిళనాడుకు చెందిన మోహన్ రాజ, సురేష్ శెట్టి అనే ఇద్దరు వ్యక్తులు సేలం నుంచి లారీలో నల్లబెల్లం తెచ్చి గద్వాల్ జిల్లాలో ధరూర్ మండలంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని గద్వాల్ ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. 510 బస్తాలలో సుమారు రూ.7లక్షలు విలువ చేసే 153క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.

# కృష్ణ మాదిగ మద్దతు కోరిన డాక్టర్ జీవీ



హైదరాబాద్, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ని మర్యాద పూర్వకంగా డాక్టర్ జీవీ ఫౌండేషన్ ఫౌండర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు కలిశారు. ఈ సందర్బంగా డాక్టర్. జీవీ మాట్లాడుతూ... గడిచిన పదహారు సంవత్సరాలు గా తాను చేస్తున్న సేవలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ చేసిన కార్యక్రమాలకు తాను ఇచ్చిన సహకరం , జిల్లా నాయకులతో వున్న మంచి సంబంధాలు గురించి వివరించారు . అదేవిధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీ నుండి ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగాలని ఆశిస్తున్నట్టు తెలియచేసి కృష్ణ మాదిగ మద్దతు కోరారు . కృష్ణ మాదిగ మాట్లాడుతూ... డాక్టర్ జీవీ తో ఇరవై ఏళ్ల స్నేహం ఉందని , మంచి వైద్యుడిగా బడుగు ,బలహీన వర్గాల కోసం పని చేస్తున్నారని , ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ జీవీ కి అండగా ఉండాలి అని మద్దతు తెలిపారు .

# ఆబ్కారీ కుర్చీలకు కదలికలు

## జోగులాంబ గద్వాల జిల్లా మద్య నిషేద, అబ్కారీ శాఖ అధికారిగా డి.అరుణ్ కుమార్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 12(ప్రభాత ఉదయం)తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీలు ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా ఎక్సైజ్ శాఖలో 14 మంది సూపరింటెండెంట్స్, ఇద్దరు ఉప కమిషనర్లు, 9 మంది సహాయ కమిషనర్లను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మల్కాజగిరి మద్య నిషేద, అబ్కారీ శాఖ అధికారిగా(డిపిఇఓ) పని చేస్తున్న డి.అరుణ్ కుమార్ జోగులాంబ గద్వాల జిల్లా మద్య నిషేద, అబ్కారీ శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. గద్వాల జిల్లా ఇంచార్జి అబ్కారీ శాఖ అధికారి సైదులు యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. గద్వాల్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ గా పని చేస్తున్న జిడి గోపాల్ దూల్ పేట -2వ సీఐగా బదిలీ కాగ ఆయన స్థానంలో మహబూబ్ నగర్ ఎన్ ఫోర్స్ మెంట్ సీఐ ఎ.గణపతి రెడ్డి గద్వాల ఎక్సైజ్ సీఐగా బదిలీ అయ్యారు. గద్వాల్ డిటిఎఫ్ సీఐ బానోత్ పటేల్ అమీర్ పేట్ కు బదిలీ కాగ ఆయన స్థానంలో అమీర్ పేట డిటిఎఫ్ సైదిరెడ్డి గద్వాలకు బదిలీ అయ్యారు. నందిన్నె చెక్ పోస్టు ఇన్స్పెక్టర్ ఎండి ఖలీద్ రంగారెడ్డి జిల్లాకు బదిలీకాగ నందిన్నె చెక్ పోస్టు ఎస్ హెచ్ ఓ -1గా, టి.లక్ష్మణ్ గౌడ్, నందిన్నె చెక్ పోస్టు ఎస్ హెచ్ ఓ -2గా ఆర్.మొగిలియ్య నాయక్, బలిగెర చెక్ పోస్టు ఎస్ హెచ్ ఓ గా వై శ్రీనివాస్ ను నియమించారు.

# నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చాం

మొదటి పేజీ తరువాయి...

ఆయన 'రోజ్‌గార్ మేళా' కింద ఉద్యోగాలు పొందిన లక్షమందికిపైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం నియామక ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తోందన్నారు. దీంతో ప్రతి ఒక్క అభ్యర్థి తన సామర్థ్యం ప్రదర్శించేలా సమాన అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అభ్యర్థి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొన్న నాటి నుంచి అపాయింట్‌మెంట్ లేఖను అందుకొనే వరకూ ఉన్న సమయాన్ని కుదించామన్నారు.



# బాధితునికి ముఖ్యమంత్రి సహాయనిధి అందించిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పార్ట్, లోని పాపిరెడ్డి నగర్ నివాసి గుజ్జాల రామిరెడ్డి కుమారుడు శ్రీనివాస్ రెడ్డి ప్రమాద వశత్తు తన కుడి కాలు తొలగించాల్సి వచ్చింది. తనకు అబోణి ఏమినేషన్ శస్త్ర చికిత్స ద్వారా కృత్రిమ కాలును అమర్చాలని నిమ్స్ దవాఖాన వైద్యులు తెలుపగ తను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు ను సంప్రదించగ, ముఖ్యమంత్రి సహాయానిదికి ధరకాస్తూ చేయించగా రూపాయలు రూ. 1,25000 లక్ష ఇరువై అయిదు వేయిలు మంజూరు అయినవి అట్టి చెక్కును శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ చేతులమీదుగా సోమవారం గొట్టిముక్కల వెంకటేశ్వర రావు సమక్షంలో అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శివ, వనం ఆంజనేయులు, ఎల్లారెడ్డి, సులోచన, అశోక్ చారి, శాంసుందర్ రావు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గ హైదరనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీలో సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. హైదరనగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీలో స్థానికంగా నెలకొన్న సమస్యలు స్థానిక కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా ఆనుకోని 80 అడుగుల లోతు సెల్లార్ తీయడంవలన రోడ్ మరియు డ్రైనేజ్ వ్యవస్థ క్రుంగిపోవడం వల్ల కాలనీ వాసుల బ్రతుకు దినదిన గండంగా మారిందని, ప్రక్కన వున్న నివాస సముదాయాలు కూడా క్రుంగుతాయేమోనన్న భయాందోళనలతో కాలని వాసులు జీవిస్తున్నారని తెలుసుకున్న జగదీశ్వర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని కన్‌స్ట్రక్షన్ కంపనీ వారు కనీస సంరక్షక భాద్యతలు తీసుకొని స్థానిక ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలని కోరారు, యుద్ధప్రాతిపదికన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని జి.హెచ్.ఎం.సి కమీషనర్,జోనల్ కమీషనర్ ఇతర అధికారులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు,కూన సత్యం గౌడ్,కొడాలి రవి,కావూరి ప్రసాద్,శ్రీకాంత్,సాద మహేష్,రాజిరెడ్డి,మురళి,మోహన్ రెడ్డి,పరుచూరి వెంకటేశ్వర రావు,కొఠారి వెంకటేష్,మనేపల్లి సాంబశివరావు,రవి,శ్యామ్,వేమూరి సాంబశివ రావు గౌతమి నగర్ కాలని వాసులు కుమారస్వామి,కృష్ణకాంత్,పరుచూరి గణేశ్ పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.